క్లుప్తంగా

మెడికల్ కిట్ల అందజేత



మేనేజర్ మూర్తికి మెడికల్ కిట్లను అందజేస్తున్న శరత్‌కుమార్

పాతపట్నం: అత్యవసర సమయంలో మెడికల్ కిట్లను వినియోగించుకోవాలని పాతపట్నం శ్రీరామ డెంటల్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సలాన శరత్‌కుమార్ అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉండే ప్రథమ చికిత్స బ్యాక్సులో ఉంచడానికి శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.మూర్తి చేతులమీదుగా డ్రైవర్లకు మెడికల్ కిట్లను స్థానిక కాంప్లెక్స్‌లో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మూర్తి మాట్లాడుతూ.. వంద మెడికల్ కిట్లను శరత్‌కుమార్ అందజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి, డాక్టర్ శిమ్మయ్య, విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ సురప్ప, మురళి, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

75 మందికి నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సారవకోట: వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా బుడితి సచివాలయంలో శుక్రవారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మందికి కంటి పరీక్షలు చేసినట్టు వైద్యుడు ప్రతాప్ డొలై తెలిపారు. వీరిలో 15 మందికి శస్త్ర చికిత్సలకు, 25 మందికి కంటి అద్దాల కోసం ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు.

సింధువాడలో గ్రామసభ



గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: ప్రజల సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని సింధువాడ పంచాయతీ సర్పంచ్ గోవిందు కామేశ్వరి అన్నారు. సచివాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో ఇప్పటి వరకు చేసిన పనులు, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి ప్రజలు, వార్డు సభ్యుల ఆమోదం పొందారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జి.వి.శివానంద మూర్తి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతిలక్ష్మి

ఎల్.ఎన్.పేట: గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అన్నారు. మిరియాపల్లి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరువ చేయాలని సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు లుకలాపు సుధీర్ ఉన్నారు.

తక్షణ సాయం పంపిణీ



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన పాగాటి కాంతమ్మ ఇటీవల మృతి చెందారు. ఈమె వైఎస్సార్‌బీమా పాలసీదారు కావడంతో కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని పంచాయతీ కార్యదర్శి అప్పారావు, వీఆర్వో శామ్యూల్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు.

రెండు పూటలా ఉపాధి పనులు



మాట్లాడుతున్న విశ్వేశ్వరరావు

సారవకోట: ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు రెండు పూటలా జరిగేటట్లు ఫీల్డు అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విశ్వేశ్వరరావు సూచించారు. స్థానిక కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల మేరకు రెండు పూటలా పనులు చేస్తేనే వేతనం గిట్టుబాటు అవుతోందనే విషయాన్ని వేతనదారులకు తెలియజేయాలన్నారు. వేసవి నేపథ్యంలో పనులు జరుగుతున్న చోట టార్పాలిన్లు, మంచినీటి సాకర్యం కల్పించాలన్నారు. ఏపీవో సత్యమూర్తి ఉన్నారు.



పాతపట్నం: పెద్దసీదిలో సంక్షేమ పథకాలు తెలియజేస్తున్న వైస్ ఎంపీపీ శోభారాణి, నాయకులు



సరుబుజ్జిలి: మూలసవలాపురంలో కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు



హిరమండలంలో సంక్షేమ పథకాలను తెలియజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్



కొత్తూరు: నీలకంఠాపురంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, నాయకులు

ఇంటింటా స్వాగతం



మెళియాపుట్టి మండల కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ



సారవకోట: గుమ్మపాడులో జగనన్నే మా భవిష్యత్ నిర్వహిస్తున్న దృశ్యం

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు చేస్తున్న ప్రజాసర్వేకు అనూహ్య స్పందన వస్తోంది. 'జగనన్నే మా భవిష్యత్..మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఇంటింటికీ వెళ్తున్న పార్టీ శ్రేణులకు ఇంటింటా ఘనస్వాగతం లభిస్తోంది. శుక్రవారం పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గోడలకు, సెల్‌ఫోన్లకు అతికించారు.



ఎల్.ఎన్.పేట: చిన్నకొల్లివలస పునరావాస కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతిలక్ష్మి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రామారావు

ఇళ్లకు వెళ్లి..ప్రతిభను పరిశీలించి..



విద్యార్థిని లావణ్య నోట్సును పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాశ్

- కొత్తూరులో పర్యటించిన విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్

కొత్తూరు: విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ కొత్తూరు మండలంలో శుక్రవారం పర్యటించారు. కడుము గ్రామాన్ని సందర్శించిన ఆయన అక్కడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులను సందర్శించారు. తొలుత తొమ్మిదో తరగతి చదువుతున్న కిల్లారి లావణ్య ఇంటికి వెళ్లి లెక్కలు సబ్జెక్టు నోట్సును పరిశీలించారు. నోట్సుతోపాటు బోధన సక్రమంగా ఉన్నట్టు గమనించి ఉపాధ్యాయుడు రాములుకు ఫోన్ చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలనే ఆశయంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అయితే పాఠశాలలో బోధన అందుకు తగ్గట్టుగా జరగడం లేదన్నారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ. 75 వేలు ఖర్చు చేస్తోందని చెప్పారు. పాఠశాలకు వెళ్తున్న పిల్లలు ఏం చదువుతున్నారో తల్లిదండ్రులు కూడా గమనిస్తుండాలని సూచించారు. ఉపాధ్యాయుల వద్ద మంచి కోసం సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం, పాఠశాలలను సందర్శించడం లేదన్నారు. దీంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ఇప్పటి నుంచి అయినా హెచ్‌ఎం నుంచి ఆర్‌జేడీ వరకు పాఠశాలలను సందర్శించాలన్నారు. సక్రమంగా పనిచేయని ఉపాధ్యాయులపై నివేదికలు ఇవ్వాలన్నారు. వసప కేజీబీవీని కూడా ప్రవీణ్ ప్రకాశ్ సందర్శించారు. పిల్లలకు పెడుతున్న మెనూ గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలాగే బోధనపై విద్యార్థినుల నుంచి ఆరా తీశారు. ఎన్నికల విధులను నిబంధనలకు కట్టుబడి నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల్లో కొంతమంది బోధనలో మాత్రం అంతశ్రద్ధ చూపడం లేదన్నారు. ముఖ్యకార్యదర్శి వెంట డీఈవో తిరుమల చైతన్య, ఆర్‌జేడీ జ్యోతికుమారి, డిప్యూటీ ఈవో పగడాలమ్మ, ఏపీసీ జయప్రకాష్, ఎంఈవో బి.శ్రీధర్, తహసీల్దార్ పి.బాల, ఎంపీడీవో పావని ఉన్నారు.

బాలికోన్నత పాఠశాల మంజూరు చేయాలని వినతి

కొత్తూరుకు బాలికోన్నత పాఠశాల మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మండలానికి వచ్చిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను వైస్ ఎంపీపీ తులసీ వర ప్రసాద్‌తోపాటు నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే అభలాసింగి గిరిజన గ్రామంలోని పాఠశాలకు పక్కా భవనం లేక పోవడంతో విద్యార్థులకు రచ్చబండపై పాఠాలు బోధిస్తున్నందున భవనం మంజూరు చేయాలని, పాతపట్నం నియోజవర్గంలోని ఉన్నత పాఠశాలలో ఆవరణలో నెలకొల్పిన అనుబంధ బాలికల వసతి గృహాల భవనాలు ప్రారంభించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో పార్టీ నాయకులు ఎ.ప్రశాంత్, వసప సర్పంచ్ ఆఫీస్‌రావు, రామకృష్ణ, చిన్నబాబు, పీఎంసీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు ఉన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు చేసింది శూన్యం

- వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట పాతబస్టాండ్ వద్ద రోడ్డు అభివృద్ధిని సెల్ఫీ ద్వారా చూపిస్తున్న నాయకులు

నరసన్నపేట: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నీరు–చెట్టుతోపాటు అనేక పథకాల పేరిట కోట్లాది రూపాయలను మింగేసిన ఆ పార్టీ నాయకులు ఇప్పుడు సెల్ఫీ చాలెంజ్‌ల పేరిట ఎందుకీ హైరానా అని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. తాము ఉన్నామని చెప్పుకోవడానికే సెల్ఫీ చాలెంజ్‌లు తప్పా టీడీపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి, నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, బోయిన బాలకృష్ణ, నేతింటి రాజేశ్వరరావు, సతివాడ రామినాయుడు శుక్రవారం మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత స్థానిక ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని వివరించారు. నరసన్నపేటలో రోడ్డు విస్తరణ చేయలేమని టీడీపీ నాయకులు చేతులెత్తేస్తే దాన్ని తాము చేసి చూపించామన్నారు. రూ. 4.5 కోట్లతో రోడ్డు విస్తరణ చేపట్టామన్నారు. అలాగే ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ కనిపించడం లేదాఅని ప్రశ్నించారు. నియోజకవర్గం వ్యాప్తంగా రోడ్లను అన్నివిధాలా అభివృద్ధి చేశామన్నారు. పసలేని సెల్ఫీలతో దిగజారుడు రాజకీయాలకు దిగి ఉన్న కాస్తా పరువు కూడా పాగొట్టుకోవద్దని హితవు పలికారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధిని గమనించాలన్నారు. మీ పాలనలో ఏనాడైనా సంక్షేమ పథకాలు అర్హులకు ఇచ్చారా అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని చేరువ చేస్తున్నామన్నారు.

భూమిని కాపాడుకుందాం

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

నరసన్నపేట: మానవుల చర్యలతో కాలుష్యం పెరుగుతోందని..ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు అడవులను పరిరక్షించి భూమిని కాపాడుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి ప్రాధాన్యతను వివరించారు. భూమిని ఎలా కాలుష్యం చేస్తున్నామో విద్యార్థులకు తెలియజేశారు. చెట్లు, అడవులను రక్షించడం ద్వారా భూమిని కాపాడుకోవచ్చునన్నారు. బోటనీ అధ్యాపకుడు ఎస్.పరమేశ్వరారావు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని తెలియచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శాంతి హేమ్, జీవీ రవికుమార్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు సహకరించాలని విజ్ఞప్తి



జెడ్పీ సీఈవో వెంకట్రామన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

పాతపట్నం: పాతపట్నం గ్రామ దేవత నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలు మే నెల 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఉత్సవాలకు సహకరించాలని కోరుతూ జిల్లా అధికారులకు శుక్రవారం వినతిపత్రాలను అందజేశారు. ఈ మేరకు జిల్లా అడిషన్ ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో ఆర్.వెంకట్రామన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టి.ఎస్.ప్రసాద్, డీపీవో వి.రవికుమార్‌తోపాటు పలువురు అధికారులకు వినతిపత్రాలతో పాటు ఆహ్వాన పత్రికలను శుక్రవారం అందజేశారు. ఉత్సవాలకు తమ సహకారం ఉంటుందని అధికారులు హామీ ఇచ్చినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా అధికారులను కలిసిన వారిలో లింగాల మధుబాబు, కాళ్ల రాజు, పైల లక్ష్మయ్య, పెద్దింటి అప్పారావు, పైల బాబ్జీ, నూలు బుజ్జి, శాసనపూరి మధుబాబు, శిర్ల జోగారావు, కొండాల యరకయ్య, శిర్ల ప్రభాకర రావు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న శ్యామలరావు

జలుమూరు: రైతు సంక్షేమంతోపాటు సొసైటీ అభివృద్ధికి బాధ్యతతో పని చేస్తానని అల్లాడ పీఏసీఎస్ నూతన అధ్యక్షుడు ఎం.శ్యామల రావు అన్నారు. అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణచైతన్యలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పి.ముసలినాయుడు, సీఈవో గిరిధర్, కమిటీ సభ్యులు అల్లు దాలప్పన్న, ఎం.భాస్కరరావు పాల్గొన్నారు.

వాత్సల్య పథకానికి 1148 దరఖాస్తులు

నరసన్నపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నరసన్నపేట, పోలాకి మండలాల్లో మిషన్ వాత్సల్య పథకానికి 1148 దరఖాస్తులు వచ్చాయని పీవో నాగమణి తెలిపారు. దరఖాస్తులను శుక్రవారం పరిశీలించారు. వీటిలో నరసన్నపేట నుంచి 620, పోలాకి నుంచి 528 దరఖాస్తులు వచ్చినట్టు పేర్కొన్నారు. వీటిని ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్టు చెప్పారు. ఈ పథకానికి ఎంపికైన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నెలకు నాలుగు వేల రూపాయల చొప్పున ఏడాది పాటు ఆర్థిక సాయం చేస్తాయన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

పొందూరు: స్పీకర్ తమ్మినేని సీతారాం మండలంలో శనివారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పొందూరులోని జేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం పది గంటలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డుమెంబర్లతో నిర్వహించే సమావేశంలో స్పీకర్ పాల్గొంటారు. అలాగే మధ్యాహ్నం మూడు గంటలకు బొడ్డేపల్లి గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ప్రారంభం, 3.30 గంటలకు మొదలవలసలో ఆరోగ్య కేంద్రం పనులకు శంకుస్థాపన, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

సంక్షిప్తంగా..

జాబ్‌కార్డు ఉంటే వంద రోజుల పని

- అధికారుల వెల్లడి



వేతనదారులతో మాట్లాడుతున్న అధికారులు

ఎల్.ఎన్.పేట: జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. వేతనదారులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్, ఏపీవో వి.శ్రీదేవి స్పష్టం చేశారు. అందరికీ పనులు కల్పించాలని కోరుతూ గార్లపాడు వంశధార పునరావాస కాలనీకి చెందిన ఉపాధి హామీ పథకం వేతనదారులు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. వెంటనే అక్కడకు చేరుకున్న అధికారులు మాట్లాడుతూ.. పనులు చేస్తున్న చెరువులో కొన్ని సమస్యలు ఉన్నందున వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం చేస్తున్న వసనాల చెరువులో ఆక్రమణలు తొలగించి పనులు కల్పిస్తామన్నారు. రెవెన్యూ, సర్వే సిబ్బందితో మాట్లాడి ఆక్రమణలు గుర్తించి.. తొలగించిన తరువాత పనులు కల్పిస్తామని స్పష్టం చేశారు. అవసరం అనుకుంటే పోలీసుల సహకారం తీసుకుంటామన్నారు.

పౌష్టికాహారం అందజేత

బూర్జ: పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. ఓవీపేట ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ చిన్నారులకు పౌష్టికాహారాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి సహకరించాలి

మెళియాపుట్టి: రేగులపాడు నుంచి పెద్దమడి గ్రామం వరకు చేపట్టనున్న డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని తహసీల్దార్ సరోజిని కోరారు. రహదారి నిర్మాణాన్ని నిర్వాసితులు ఇటీవల అడ్డుకున్న నేపథ్యంలో చీపురుపల్లి గ్రామంలో సవర చీపురుపల్లి గ్రామ నిర్వాసితులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. 13 మంది గిరిజనులకు డి.పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం జరిగితే రాకపోకలకు ఇబ్బందులు ఉండవన్నారు.

ఆధార్ ప్రత్యేక డ్రైవ్ పరిశీలన

పాతపట్నం: ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్డీ ఎస్.ప్రసాద్ పండా అన్నారు. పాతపట్నం, పెద్దసీది, తెంబూరు, సచివాయల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్ కార్డు తీసుకొని పదేళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

3న ఆలయ పునః ప్రతిష్ట

జలుమూరు: రాణ గ్రామంలోని విష్ణు ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని మే నెల మూడో తేదీన నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు దుంగ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. తన తండ్రి..మాజీ సర్పంచ్ అప్పారావు కోరిక మేరకు 12 లక్షల రూపాయలు వెచ్చించి ఆలయాన్ని పునః నిర్మాణం చేపట్టినట్టు పేర్కొన్నారు. గ్రామ శివర్లో ఉన్న విష్ణు విగ్రహాన్ని ఇప్పటికే బయటకు తీసి పునః ప్రతిష్టతకు ఏర్పాట్లు చేశామన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

ఆమదాలవలస రూరల్: బెలమాం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ కణుగుల కిశోర్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల మేరకు రెండు పూటలా పనులు చేస్తేనే వేతనం గిట్టుబాటు అవుతోందన్నారు. పనుల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన




భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హిరమండలం: హిరమండంలోని కేజీబీవీని ఎంపీడీవో బి.శైలజ, తహసీల్దార్ బి.మురళీమోహన్, ఎంఈవో కె.రాంబాబు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం అమలు తీరును, పాఠశాల పరిసరాలు, వసతులు, వంట గదిని పరిశీలించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్.క్రిష్ణవేణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమాచారం ఇవ్వకుండానే సమావేశాలా?

- మండల సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరమ్మ

మెళియాపుట్టి: గ్రామ పంచాయతీ స్థాయిలో జరుగుతున్న సమావేశాలకు తమకు సమాచారం ఇవ్వడం లేదని పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన స్థానిక మండలాభివృద్ధి కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ స్థాయిలో జరగాల్సిన సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదని, జరిగిన చోట్ల కూడా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని వాపోయారు. ఎంపీడీవో చంద్రకుమారి స్పందిస్తూ.. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని కార్యదర్శులందరికీ ఆదేశాలు జారీ చేసి ఉన్నామన్నారు. మరికొందరు సభ్యులు మాట్లాడుతూ.. గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యలు కొలిక్కిరాకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వీధిదీపాలు వేయడానికి ప్రైవేట్ వ్యక్తులకు డబ్బులు ఇచ్చుకొని పనులు చేయాల్సి వస్తోందని, లైన్‌మన్లకు విద్యుత్ స్తంభం ఎక్కడం కూడా రాదని వసుంధర ఎంపీటీసీ సభ్యుడు సలాన జనార్దన్(చిట్టి), చీపురుపల్లి సర్పంచ్ ఈశ్వరరావు అన్నారు. ఎంఈవో దేవేంద్రరావు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని జెడ్పీ ఉన్నత పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. వసుంధర ఎంపీటీసీ సభ్యుడు జనార్దన్, కరజాడ సర్పంచ్ బమ్మిడి పున్నయ్య మాట్లాడుతూ.. తమ గ్రామాల్లో మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు సరుకులను పక్కదారి పక్కదారి పట్టిస్తూ.. నాణ్యతలేని భోజనాన్ని విద్యార్థులకు పెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని అడిగినా స్పందించడం లేదని, వారిస్థానంలో కొత్తవారిని నియమించాలన్నారు. ఎంఈవో స్పందిస్తూ ప్రజాప్రతినిధుల సమక్షంలో పరిశీలిస్తామన్నారు. ఎంపీపీ ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తామన్నారు. ఇటీవల మరణించిన జాడుపల్లి పాఠశాల వంట నిర్వాహకురాలు మల్లిపెద్ది రమ మృతిపై ఎమ్మెల్యే రెడ్డిశాంతి స్పందించారని.. వారి కుటుంబానికి ప్రభుత్వం తరపున సహాయం అందిస్తారన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ భవన నిర్మాణాల పనులు ప్రారంభమయ్యావన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలపై ప్రజలకు వివరించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులకు సూచించారు. గోకర్ణపురం సర్పంచ్ శనాపతి రవికుమార్ మాట్లాడుతూ.. క్షేత్రసహాయకుడు చౌదరి లవకుమార్ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ అనుమతి లేని పనులు చేస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఉపయోగకరమైన పనులకు అధికారులు అనుమతులు ఇవ్వడంలేదా అని ప్రశ్నించారు. చిన్నహంస గ్రామానికి చెందిన రైతుల వ్యక్తిగత పనుల్లో అలసత్వం, అదే గ్రామానికి సంబంధించి చెరువులు, కాలువల పనులు చేయడంలేదని ఆరోపించారు. క్షేత్ర సహాయకుడుని మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీవో రవి స్పందిస్తూ గతంలో రెండుసార్లు మెమోలు జారీ చేశామన్నారు. దీనిపై గ్రామాన్ని సందర్శించి క్షేత్రసహాయకునిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఈశ్వరమ్మ ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు భాస్కరదాస్, వైస్ ఎంపీపీ ఆదినాయుడు, రాష్ట్రటికార్ డైరెక్టర్ సవర ఈశ్వరమ్మ, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ మాధవరావు, తహసీల్దార్ సరోజిని, ఏవో దానకర్ణుడు, ఏపీపీఎం లలిత పాల్గొన్నారు.

నేడు, రేపు పన్నులు చెల్లించవచ్చు

ఆమదాలవలస: ఇళ్లు, ఖాళీ స్థలం పన్నులను ఈ నెలాఖరులోగా చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ వర్తిస్తోందని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 22, 23 తేదీలు సెలవు రోజులైనప్పటికీ పురపాలక సంఘం కార్యాలయంలో పన్నుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

రూ.3.18 లక్షలకు వేలం ఖరారు



వేలం పాట నిర్వహిస్తున్న సర్పంచ్ సతీష్, అధికారులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం మార్కెట్ వేలం ఆశీల పాట రూ.3.18,500 లకు గ్రామానికి చెందిన ఉమాచంద్ర పండా దక్కించుకున్నారని పంచాయతీ విస్తరణ అధికారి ఈశ్వరరావు గురువారం తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ టి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించామన్నారు. ఎంపీటీసీ కె.హరిప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి



దాసుపురంలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది అడ్మిషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారని ప్రిన్సిపాల్ కె.సుజాత అన్నారు. మండలంలోని రంకిణి, దాసుపురం, చంగుడి, దసరధపురం గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్ల వెళ్లి తమ కళాశాలలో అడ్మిషన్లు తీసుకునేలా మోటివేషన్ చేశామన్నారు. ఇంటర్‌లో ఆర్ట్స్, సైన్సు గ్రూపుల్లో జాయినింగ్ అవ్వాలని కోరామన్నారు.

వడదెబ్బపై అప్రమత్తం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మెడికల్ అధికారి వంశీకృష్ణ

జలుమూరు: వడదెబ్బ తగలకుండా ఉపాధి వేతనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి చల్ల వంశీకృష్ణ అన్నారు. తలతరియా గ్రామంలో ఉపాధి వేతనదారులకు ఎండ వేడిమి, వడదెబ్బపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. వేసవిలో మంచినీరు, కొబ్బరినీరు, బార్లీ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ వంటి ద్రావణాలు తీసుకోవాలన్నారు. చల్లగా, వదులుగా ఉండే తెల్లని కాటన్, ఖద్దరు దుస్తులు ధరించాలని, బయటకు వెళితే టోపీ పెట్టుకోవాలన్నారు. మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ రూపాస్వప్న, పర్యవేక్షకులు కె.లలితాంబ, ఆరోగ్య కార్యకర్త ధనలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనంపై హర్షం



స్పీకర్ తమ్మినేని సీతారాంను సత్కరిస్తున్న పాస్టర్లు

ఆమదాలవలస: పాస్టర్లకు ఐదు వేల గౌరవ వేతనం చెల్లింపు పట్ల వారంతా హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద స్పీకర్ తమ్మినేని సీతారాంను పలువురు పాస్టర్‌లు కలిసి సత్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అన్ని వర్గాల వారికి అండగా ఉండేందుకు ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల మంది పాస్టర్లకు గౌరవ వేతనం అందజేస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ సందర్భంగా పాస్టర్ సంఘ నాయకులు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలోనూ తమకు ఆర్థికంగా చేయూత అందించారన్నారు. శాసనసభాపతికి ఆశీర్వచనాలు అందించారు. ఆమదాలవలస పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు పాస్టర్‌లు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు పత్రాల పంపిణీ



భూ యాజమాన్య హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న వీఆర్వో రమేష్

బూర్జ: మండలంలోని డొంకలపర్త గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. వీఆర్వో రమేష్, ధనలక్ష్మి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



పాతపట్నం: కొరసవాడలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హిరమండలం: పాతహిరమండలంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సరుబుజ్జిలి: తురకపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జగనన్నే మా భవిష్యత్తు



ఆమదాలవలస రూరల్: తోటాడలో కరపత్రాలను అందజేస్తున్న సర్పంచ్ మెట్ట శారద

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లను అతికించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: దాశరథీపురంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మెళియాపుట్టి: జలకలింగుపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కొమ్మువలసలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: కంబకాయలో కరపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం



బప్పడాంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: అర్హత కలిగిన ప్రతీఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం స్పష్టంచేశారు. మండలంలోని బప్పడాం, అమృతలింగానగరం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు అందిస్తున్న పథకాలను వివరించారు. పథకాల పంపిణీలో ఎటువంటి లోటుపాట్లు ఉన్నది, లేనిది అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం చేపట్టనున్న పథకాల గురించి తెలియజేశారు. ప్రజలు చెప్పిన ఇంటి బిల్లులు, పింఛన్ల సమస్యలను అధికారులతో చర్చించి క్షేత్రస్థాయిలోనే పరిష్కరించారు. రాష్ట్ర అభివృద్ధి బాటలో పయనించాలంటే ప్రజలంతా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి బాసటగా నిలవాలని స్పీకర్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, పార్టీ మండల కమిటీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, గ్రామ సచివాలయాల మండ కోఆర్డినేటర్ అత్తులూరి రవికాంత్, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, ఇల్లాకుల సూర్య ప్రకాశరావు, సురవరపు సింహాచలం, బొడ్డేపల్లి హరి పాల్గొన్నారు.

మహానగరంగా శ్రీకాకుళం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ



ఆమదాలవలస: జిల్లాలో పోర్టు నిర్మాణానికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చూపించిన చొరవతో మహానగరాలైన ముంబై, చెన్నైలా తయారవుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. బుధవారం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన సీఎంను కలిసి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాన్ని అందజేశానని తెలిపారు. జిల్లాల పునర్విభజన జరిగిన తరువాత అన్ని శాఖలను జిల్లాల వారిగా విడదీశారని, విద్యుత్‌శాఖ మాత్రం 13 జిల్లాలకే పరిమితం చేశారని గుర్తుచేశారు. ఆ శాఖ కూడా అన్ని జిల్లాలకు సమానంగా విభజిస్తేనే విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయని నివేదించినట్లు తెలిపారు. అలాగే ఆమదాలవలస నియోజవకవర్గానికి సంబంధించి సరుబుజ్జిలి, బూర్జ మండల కేంద్రాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. బూర్జ మండలం నాగావళి నదిపై గల బూర్జ ఓపెన్ హెడ్ చానల్ అల్లెన, వావాం, పెదలంకాం, చిన్నలంకాం, మామిడివలస, బూర్జ, నీలంపేట, కురుంపేట మీదుగా ప్రవహించి వేల ఎకరాల పంట పొలాలకు సాగు నీరు అందిస్తుందన్నారు. ఈ కాలువ సుమారు 25 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదని, దీంతో సాగునీరు సక్రమంగా అందడంలేదన్నారు. ఈ కాలువ మరమ్మతులకు పూర్తిస్థాయిలో నిధుల మంజూరు చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లానని గాంధీ చెప్పారు.

రహదారి నిర్మాణానికి చర్యలు



కొలతలు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ కూడలి నుంచి మారుతీనగర్ మొదటి లైన్ మీదుగా జాతీయ రహదారి వంతెన వరకు సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రోడ్డును 24 అడుగుల మేర వెడల్పు చేసేందుకు ఎమ్మెల్యే గ్రాంట్ నుంచి రూ.20 లక్షలు మంజూరు చేశారు. డ్రైన్ నిర్మాణానికి ఉపాధి నిధులు రూ.8 లక్షలు, పోల్స్ మార్చడానికి పంచాయతీ నిధులు రూ.3 లక్షలు కేటాయించారు. వీటన్నింటితో పనులు చేపట్టేందుకు గురువారం సాయంత్రం పీఆర్ సిబ్బంది కొలతలు వేశారు. రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని సర్పంచ్ బూరల్లి శంకర్, వార్డు సభ్యులు ఆర్.శ్రీధర్(బుజ్జి) తెలిపారు. వీధి వాసులు అందరూ సహకరించాలని కోరారు. ఈ రోడ్డు నిర్మాణం అయితే చాలా వరకూ ట్రాఫిక్ సమస్యలు పరిష్కారవుతాయని సర్పంచ్ అన్నారు. రోడ్డు సెంటర్ నుంచి చెరో 12 అడుగులు చొప్పున వెడల్పు చేయనున్నామని పీఆర్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ అచ్యుతరావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చీపురు కృష్ణ, రమణ సాహూ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో వలసల నివారణ

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: ఉపాధి పనులతో గ్రామాల్లో వలసలను నివారించవచ్చని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. గురండి పంచాయతీ పరిధి దాశరదీపురం గ్రామానికి చెందిన పూనె చెరువులో ఉపాధి పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోర సింహాద్రి నాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రోజుకు సుమారు రూ.250లు కంటే ఎక్కువ వేతనాలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఉపాధి నిధులతో గ్రామాల్లోని సీసీ రోడ్లు, కాలువలు, పక్కా భవనాలు నిర్మించుకునే అవకాశం ఉందన్నారు.

గురండి సచివాలయం ఉద్యోగులపై ఫిర్యాదు...

గురండి గ్రామ సచివాలయం ఉద్యోగులు సక్రమంగా సేవలు అందివ్వడం లేదని సర్పంచ్‌తోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే సచివాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ప్రజలకు సక్రమంగా సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. జెడ్పీటీసీ కామక భాగ్యవతి, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ నాయకులు రాఘవ, జి.వాసు, ఎస్.గోవింద, కుంచాల నూకరాజు, బూర్లె శ్రీనివాసరావు, మెజ్జాడ చక్రపాణి, కామక త్రినాథరావు, వై.ధర్మారావు, ఏపీఓ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూమికి మేలు



సరుబుజ్జిలి: అవగాహన ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



కొత్తూరు: మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

సరుబుజ్జిలి: నవధాన్యాలు సాగుతో జీవవైవిధ్యం పెరిగి భూమికి ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం డీఏ బాబాజీ తెలిపారు. మండలంలోని రావివలస యూనిట్ పరిధిలోని పాలవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై గురువారం మహిళలకు అవగాహన కల్పించారు. పాలవలస సర్పంచ్ గజ్జన మోహన్‌రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సాగు శ్రేయస్కరం

కొత్తూరు: భూసార పరీక్షల్లో వచ్చిన ఫలితాలు ఆధారంగా పంట సాగు చేయడం మంచిదని కర్లెమ్మ గ్రామ సచివాలయం వ్యవసాయ సహాయకురాలు, ప్రకృతి వ్యవసాయం ఎంటీ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కర్లెమ్మలో గురువారం వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయం శాఖ ఉమ్మడి భూసార పరీక్షలు కోసం మట్టి నమూనాలను సేకరించారు. భూసార పరీక్షలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. మట్టి నమూనాలు ఎలా సేకరించాలో వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు పీడీఎస్ బియ్యం వేలం

కొత్తూరు: ఈ నెల 21వ తేదీన 27.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వేలం వేయనున్నారు. ఈ మేరకు సీఎస్ డీటీ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఏడాది జనవరి ఒకటో తేదీన ఈ బియ్యం పట్టుబడ్డాయన్నారు. కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద మూడు గంటలకు వేలం పాట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

సారా ప్యాకెట్లతో పట్టుబడిన మహిళ

సరుబుజ్జిలి: మండలంలోని సుబ్బపేట గ్రామానికి చెందిన మహిళ వద్ద 160 సారా ప్యాకెట్లు తోపట్టుబడినట్లు ఆమదాలవలస స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ కె. సునీల్‌కుమార్ గురువారం వెల్లడించారు.ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం: హిరమండలం, సుభలయ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, నౌగూడ గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పాలకొండ ఈఈ టీజీకే మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిరమండలం విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో కొత్త విద్యుత్ స్తంభాలు వేయడం, పాత కండక్టర్లను మార్చడం వంటి పనుల చేపడతామన్నారు.

ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని తీర్మానం

కొత్తూరు: మండలంలోని పారాపురం రిజర్వాయర్ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించాలంటూ గూనభద్ర ఆర్ఆర్ కాలనీ పంచాయతీలో గురువారం సర్పంచ్ పెదకోట సాదుబాబు అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో తీర్మానించారు. ఎత్తిపోతల పథకం నిర్మాణం వల్ల వంశధార నిర్వాసిత గ్రామాలైన దుగ్గుపురం, పాడలి, ఇరపాడు, లబ్బ, ఓంద్రుజోల, పారాపురం, గూనభద్రతోపాటు పలు గ్రామాలకు చెందిన సుమారు 5 వేల ఎకరాలకు సాగునీటితోపాటు తాగునీరు అందుతుందన్నారు. 2022–23 ఏడాదిలో పంచాయతీకి ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదాయం, వ్యయాలను పంచాయతీ కార్యదర్శి జ్యోష్న వివరించారు. పంచాయతీలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను తెలియజేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

పాతపట్నం: తప్పుడు ఆస్తి పత్రాలతో తన స్థలాన్ని అచ్చుతాపురం గ్రామానికి చెందిన సలాన బాలరాజు విక్రయించారని అదే గ్రామానికి చెందిన గొర్లె తేజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు బాలరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు గురువారం తెలిపారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



ప్రచార బేరీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

హిరమండలం: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రం బస్‌స్టాండ్ ఆవరణంలో గురువారం ప్రచార బేరీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రజా సొమ్ము ధారాత్తం చేస్తోందని ఆరోపించారు. దళిత, గిరిజన, రైతు, కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. అనంతరం ప్రచార బేరీ పోస్టర్లు ఆవిష్కరించారు. సీపీఎం సీనియర్ నేత ఎం.అప్పారావు, రమణ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ అందజేస్తున్న రంజిత్, తదితరులు

జలుమూరు: చలివేంద్రాల ఏర్పాటుతో ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీరుతుందని నేచర్ సేవ్ సొసైటీ సంఘం వ్యవస్థాపకుడు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లుకులాపు రంజిత్ కుమార్ అన్నారు. రాణ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. పాదాచారులు, ప్రయాణికులకు మజ్జిగ, తాగునీరు అందించారు. నేచర్ సేవ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సొసైటీ సభ్యులు తంగి కృష్ణ, కోరుకొండ శాంతారావు, ఎన్ని శ్రీధర్, సత్యం, రెడ్డి రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు సిద్ధం



సిద్ధం చేసిన నవధాన్యాల కిట్లు

సారవకోట: నవధాన్యాలను అందించేందుకు చీడిపూడి ఆర్‌బీకేలో 30 రకాల విత్తనాలతో వెయ్యి కిట్లు సిద్ధం చేశామని, రైతులు వినియోగించుకోవాలని ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు మోహన్, జ్యోతి గురువారం తెలిపారు. వీటిని తొలకరిలో విత్తుకొని భూసారాన్ని పెంచుకోవచ్చని సూచించారు. ఒకే పంట కాకుండా పలు పంటలు వేయడం ద్వారా మేలు జరుగుతుందని వివరించారు. నవ ధాన్యాల సాగును రైతులు అలవర్చుకోవాలని సూచించారు. వీటి ప్రయోజనాలను రైతులకు వివరించారు. వీఏఏ దిలీప్, మాస్టర్ ట్రైనీలు రమణ, శోభన్‌బాబు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల నిలుపుదల

పొందూరు: మండలంలోని కొంచాడ గ్రామంలో గల అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, సర్వే అధికారులు గురువారం అడ్డుకున్నారు. ఆర్‌అండ్‌బీ, పీడబ్ల్యూడీకి చెందిన భూములను కొంత మంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. తహసీల్దార్ రాంబాబుకు కొంచాడ సర్పంచ్ అనూరాధ ఫిర్యాదు చేశారు. ఆర్ఐ రాధ, వీఆర్వో సాయి, రేవతిరావు వచ్చి పరిశీలించారు. నిర్మాణాలకు ఉన్న అనుమతి పత్రాలను అడిగారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేయడంతో పాటు నిర్మాణాలు కూల్చేస్తామని హెచ్చరించారు.

రోడ్లు బాగు చేయాలని వినతి



ఐటీడీఏ పీఓను సత్కరిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏకు నూతనంగా నియామకైన పీఓ కల్పన కుమారిని కొత్తూరు ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు గురువారం ఐటీడీఏలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గిరిజన గ్రామాల్లోని రోడ్ల దుస్థితిని పీఓకు వివరించారు. అడ్డంగి పంచాయతీ పరిధి అబలాసింగి రోడ్డులో మిగిలి ఉన్న పనులు పూర్తిచేయాలని, గొట్టిపల్లి పంచాయతీ పరిధి కోతం గూడ రోడ్డును బాగు చేయాలని కోరారు. రోడ్లు బాగు లేకపోవడంతో గర్భిణులు, రోగులు ఇబ్బంది పడుతున్నారని పీఓ దృష్టికి తీసుకువెళ్లారు. వీరితోపాటు వైఎస్సార్‌సీపీ నేతలు సవర రమేష్, కె.సంజీవు, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎ.ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

హద్దుల గుర్తింపు

ఎల్.ఎన్.పేట: గ్రామ సరిహద్దులు, సర్వే నంబర్లు, సబ్ డివిజన్లు వారిగా రైతుల సమక్షంలోనే సరిహద్దు రాళ్ల పాతడం జరుగుతుందని తహసీల్దార్ బి.ఎస్.ఎస్.సత్యనారాయణ అన్నారు. మండలంలోని శ్యామలాపురం రెవెన్యూ పరిధిలో సర్వే పూర్తిచేసుకున్న ప్రాంతాల్లో గురువారం హద్దులు గుర్తించామన్నారు. సర్వేకు సంబంధించి రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి రాళ్లను పాతించారు. సర్వే రాళ్లను కాపాడుకునే బాధ్యత రైతులపై ఉందన్నారు. మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, వీఆర్వో రాంబాబు, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.